# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో రైతు బజార్లలో నాణ్యత లేని సరకులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.
- రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలలో ఇంటింటికీ తాగు నీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో ప్రధాన ఆలయాలు ఆధ్యాత్మిక శోభనుసంతరించుకున్నాయి.
- విజయనగరంలో ఈ నెల 14వ తేదీన జరిగే సిరి మానోత్సవ కార్యక్రమానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

=============================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అన్ని ప్రధాన ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఈ రోజు ఉదయం శ్రీ వారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి తిరుమాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మరొక వైపు... మరి కొద్ది సేపట్లో స్వామి వారు అశ్వ వాహనంపై కల్కి అవతారంలో దర్శనమివ్వనున్నారు. చివరి ఘట్టం రేపు జరిగే చక్ర స్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. శ్రీ వారి చక్ర స్నాన కార్యక్రమానికి పుష్కరిణీ వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇదిలా ఉండగా.... శ్రీశైలంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ భ్రమరాంబికాదేవి ఈ రోజు సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి శ్రీశైల పుర వీధులలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తారు. కాగా.... విజయవాడలోని ఇంద్ర కీలాద్రిపై ఈ రోజు

మహిషాసురమర్ధిని దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న... శ్రీ కనక దుర్గమ్మ వారు రేపు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారు. పూర్ణాహుతి కార్యక్రమంతో రేపు ఇక్కడ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున సంబంధిత అధికారులు ఈ రోజు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భవానీ దీక్షా దారులు కూడా అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

==============================

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగుస్తున్న  సందర్భంగా విజయదశమి పర్వదినం కోసం సాగరతీర నగరం విశాఖ సుందరంగా ముస్తాభయ్యింది. నగరంలోని అమ్మవారి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. విశాఖపట్నం నుండి ఆకాశవాణి ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి మరిన్ని వివరాలు అందిస్తున్నారు.

(వాయిస్ 36 సెకన్లు)

==============================

విజయనగరంలో ఈ నెల 14, 15వ తేదీలలో జరిగే పైడితల్లి అమ్మవారి తొలేళ్ళు... సిరి మానోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ  కార్యక్రమంలో పాల్గొననవలసిందిగా కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఎన్.ఆర్.ఐ. సాధికార శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆహ్వానం అందజేశారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలుసుకున్న ఆయన, ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే అతి పెద్ద పండుగైన పైడితల్లి అమ్మవారి ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఇతర మంత్రులను కూడా ఆయన ఆహ్వానించారు.

==============================

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (I.M.D.) తెలిపింది. మరొక వైపు... ఈశాన్య ఋతుపవనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల కూడా ఆంధ్రప్రదేశ్ లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో 14 నుండి 16వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. నిన్న, ఈ రోజు దక్షిణ కోస్తాలోని అనేక ప్రాంతాలలో వర్షాలు కురిసాయి.

విరామం

==============================

రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో నాణ్యతలేని సరకులు విక్రయిస్తే... కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ హెచ్చరించారు. విజయవాడలోని రెండు రైతు బజారులను ఈరోజు ఆయన పరిశీలించారు. వంట నూనెలు, ఉల్లిపాయలు, టమాటా విక్రయాల గురించి వినియోగదారుల నుండి సమాచారం తెలుసుకున్నారు. పామాయిల్ లీటర్ 110 రూపాయలకు, సన్ ఫ్లవర్ ఆయిల్ 124 రూపాయలకు విక్రయించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని దుకాణాల వద్ద ధరలు సూచించే పట్టికలను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి నాదేండ్ల మనోహర్ అధికారులను ఆదేశిస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

==============================

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాలలో ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మహ్మదాపురంలో నెల్లూరు నగరానికి తాగు నీరు అందించే పథకాన్ని ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏషియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సహాయంతో ఈ తాగునీటి పనులను చేపడతామని తెలిపారు. వచ్చే 2028 సంవత్సరంలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ....

(వాయిస్ 28 సెకన్లు)

=============================

బాలికల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. ఐక్య రాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఏటా అక్టోబర్ 11వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో ఉన్నతాధికారులు నిర్వహించి సమాజంలో బాలికలు అన్ని రంగాలలో అభివృద్ధి కావలసిన ఆవశ్యకతను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను వివరించారు. ఈ పథకాలను బాలికలు అందిపుచ్చుకోవాలని వారు సూచించారు. శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పాల్గొన్నారు.

=============================

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, ఎయిడెడ్ కళాశాలల సమయాలలో మార్పులు చేస్తూ ఇంటర్మీడియట్ బోర్డు సంచాలకులు కృతికా శుక్లా ఈ రోజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ కళాశాలలు పని చేస్తుండగా.. ఈ నెల 16వ తేదీ నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ వేళలను పొడిగించారు. ఆశించిన స్థాయిలో విద్యార్థులు ఫలితాలు సాధించాలన్న ఉద్దేశ్యంతో పని వేళలను పొడిగిస్తున్నామని, 4 నుండి 5 గంటల మధ్య స్టడీ అవర్ నిర్వహించాలని, ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ సంబంధిత మార్పులు చేసుకోవాలని కృతీకా శుక్లా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=============================

రాష్ట్ర ఆర్థిక పురోగతిలో భాగంగా వివిధ విధానాలను రూపొందించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలను విభజించి పరిష్కరించే దిశగా కార్యాచరణను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీలోగా ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలు, విధానాల రూపకల్పన విధానాలను తనకు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

=============================

రాష్ట్రంలో జల వనరుల ప్రాజెక్టులలో అత్యవసరంగా చేపట్టవలసిన పనుల కోసం నీటి పారుదల శాఖకు 284 కోట్ల రూపాయల మేర నిధులు విడుదల చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ నుండి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మొత్తంతో కాలువల సక్రమ నిర్వహణ, ప్రాజక్టు గేట్ల మరమ్మతులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

=============================

పార్వతీపురం మన్యం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు జరిగాయి.

==============================

==============================